




PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు



సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.



| గురువారం 13 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక :72 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|


# బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పథకం



హైదరాబాద్ – సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టనుంది. కుట్టు వృత్తిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న పేద, నిరుద్యోగ బీసీ మహిళలకు 100 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను మహిళలకు అందించనున్నారు. లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో మిషన్లు అందించడం ఈ పథకం ప్రత్యేకతగా నిలవనుంది. ఆగస్టు 13, గురువారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని జీ-29లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆధునిక ఆటోమేటిక్ కుట్టు మిషన్ల ద్వారా మహిళలు ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందుతూ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం కల్పించడంతో పాటు వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళలుగా, భవిష్యత్‌లో మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే పథకం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. పథకం విధివిధానాలు, బడ్జెట్ కేటాయింపులు, లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వెల్లడించనున్నారు. కార్యక్రమంలో బీసీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొననున్నారు. బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం మహిళా సాధికారత దిశగా కీలక ముందడుగుగా నిలవనుంది.



# ఆర్మీ నియామకాల్లో తెలంగాణ యువతకు మరిన్ని అవకాశాలు

హైదరాబాద్ – సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి. రాజేష్ పుష్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మేజర్ జనరల్ శ్రీనివాస్‌రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ యువతకు భారత ఆర్మీలో నిర్వహించే వివిధ నియామకాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం, ఆర్మీ కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఆర్మీ నియామకాలకు ముందు ఆసక్తి, అర్హత ఉన్న యువతకు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం కోరగా, దేశవ్యాప్తంగా జరిగే ఆర్మీ నియామకాలకు ముందే తెలంగాణలోని అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సానుకూలంగా స్పందించారు. విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపై కూడా ముఖ్యమంత్రి చర్చిస్తూ రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక, రక్షణ చర్యలు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కార్యక్రమాల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రత్యేక చొరవ తీసుకునేలా స్థానిక ఆర్మీ అధికారులకు ఆదేశాలు ఇస్తామని లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టును ఆయన అభినందిస్తూ హైదరాబాద్ నగరాన్ని రక్షించడంతో పాటు కాలుష్యాన్ని తగ్గించి మూసీ నదికి చారిత్రక వైభవాన్ని పునరుద్ధరించేందుకు ఈ ప్రాజెక్టు అవసరమని పేర్కొన్నారు.



# తెలంగాణ-బిహార్ మధ్య వ్యవసాయ సహకారానికి కొత్త అడుగు

హైదరాబాద్ – సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: తెలంగాణ వ్యవసాయ విధానాలపై బిహార్ ప్రభుత్వం ఆసక్తి వ్యక్తం చేయగా, హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో బిహార్ వ్యవసాయశాఖ మంత్రి విజయ్ కుమార్ సిన్హా సమావేశమై రెండు రాష్ట్రాల మధ్య వ్యవసాయ రంగంలో పరస్పర సహకారం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, ఉత్తమ విధానాల అధ్యయనం, పంటల వైవిధ్యీకరణ, రైతుల ఆదాయ పెంపు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణలో అమలు చేస్తున్న వాతావరణ హెచ్చరికలు, రైతు నేస్తం, పంటల నమోదు, ఉపగ్రహ ఆధారిత పంటల పర్యవేక్షణ, యూరియా బుకింగ్, అగ్రిస్టాక్ ద్వారా రైతు గుర్తింపు, కృత్రిమ మేధ ఆధారిత పంటల పర్యవేక్షణ వంటి సాంకేతిక కార్యక్రమాలను మంత్రి తుమ్మల బిహార్ మంత్రికి వివరించారు. రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న రైతుబంధు, రైతు బీమా, రైతుభరోసా, సన్న వడ్లకు బోనస్, రుణమాఫీ తదితర పథకాల వివరాలను కూడా వెల్లడించారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణపై బిహార్ మంత్రి ఆసక్తి వ్యక్తం చేయగా, బిహార్‌లో విస్తృతంగా సాగవుతున్న మకానా పంట ఉత్పత్తి, ప్రాసెసింగ్, విలువ జోడింపు, మార్కెటింగ్ విధానాలపై మంత్రి తుమ్మల ఆసక్తి చూపారు. ఆయిల్‌పామ్ సాగు విధానాలను పరిశీలించేందుకు బిహార్ నుంచి అధికారులు, ప్రతినిధులు, రైతుల బృందాన్ని తెలంగాణకు ఆహ్వానించడంతో పాటు మకానా సాగు విధానాలను అధ్యయనం చేసేందుకు తెలంగాణ నుంచి ప్రతినిధుల బృందాన్ని బిహార్‌కు పంపించాలని నిర్ణయించారు. బిహార్‌లో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన నాటుసామగ్రి, మైక్రో ఇరిగేషన్, ప్రాసెసింగ్ తదితర అంశాల్లో తెలంగాణ ప్రభుత్వం సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. రెండు రాష్ట్రాల వ్యవసాయ విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, పంటల వైవిధ్యీకరణను పరస్పరం పంచుకోవడం ద్వారా రైతుల ఆదాయం, ఉత్పాదకత, మార్కెట్ అవకాశాలు మెరుగుపడతాయని ఇరువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించిన అర్బన్ ఫార్మింగ్, మిద్దె పంటలు, వంటింటి తోటల ప్రదర్శనలో మంత్రి తుమ్మల పాల్గొని నగర ప్రజలు బాల్కనీలు, మిద్దెలు, ఇంటి ప్రాంగణాలు, కమ్యూనిటీ స్థలాల్లో కూరగాయలు, ఆకుకూరలు, మూలికలు పెంచుకోవాలని సూచించారు. తాజా ఆహారం, ఆరోగ్యకరమైన జీవనం, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణకు పట్టణ వ్యవసాయం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయశాఖ అధికారులు, బిహార్ ప్రతినిధులు, రైతు నేస్తం చైర్మన్ వై. వెంకటేశ్వరరావు, ఎఫ్‌టీసీసీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జైళ్ల చరిత్రలో తొలిసారి 78 మంది ఖైదీలకు ఎస్ఎస్‌సీలో ఉత్తీర్ణత

హైదరాబాద్ – సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: తెలంగాణ జైళ్ల చరిత్రలో తొలిసారిగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) ద్వారా 78 మంది ఖైదీలు పదో తరగతి (ఎస్ఎస్‌సీ) పరీక్షలో ఉత్తీర్ణత సాధించగా, వారి విద్యా ప్రయాణం, స్వీయాభివృద్ధి, పునరావాసాన్ని ప్రోత్సహించేలా తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డా. సౌమ్య మిశ్రా ప్రత్యేక రెమిషన్ ప్రకటించారు. ఖైదీలు తమ విద్యను కొనసాగించి ఎస్ఎస్‌సీ పూర్తి చేసుకునేలా తెలంగాణ జైళ్ల శాఖ ఎన్ఐఓఎస్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకోగా, చర్లపల్లి సెంట్రల్ ప్రిజన్, నిజామాబాద్ సెంట్రల్ ప్రిజన్, హైదరాబాద్ ప్రత్యేక మహిళా జైలుకు చెందిన మొత్తం 108 మంది ఖైదీలు పదో తరగతి విద్యా కార్యక్రమంలో చేరారు. వీరికి ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు అవసరమైన చోట ప్రైవేట్ ఉపాధ్యాయులను నియమించి జైళ్ల శాఖ ఆధ్వర్యంలో విద్యాబోధన అందించారు. ఒక సంవత్సరం పాటు క్రమబద్ధమైన విద్యా ప్రణాళికలో భాగంగా తరగతులు, మాక్ టెస్టులు, ప్రీ-బోర్డ్ పరీక్షలు నిర్వహించి ఖైదీలను ఎన్ఐఓఎస్ పరీక్షలకు సిద్ధం చేయగా, మొత్తం 78 మంది విజయవంతంగా ఉత్తీర్ణత సాధించారు. వీరిలో చర్లపల్లి సెంట్రల్ ప్రిజన్‌కు చెందిన 56 మంది, నిజామాబాద్ సెంట్రల్ ప్రిజన్‌కు చెందిన 15 మంది, హైదరాబాద్ ప్రత్యేక మహిళా జైలుకు చెందిన ఏడుగురు ఉన్నారు. భవిష్యత్తులో ఉపాధి, జీవనోపాధికి ఉపయోగపడేలా పాఠ్యాంశాలను రూపొందించడంతో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ వంటి నైపుణ్యాలకు సంబంధించిన అంశాలను కూడా చేర్చారు. ఎస్ఎస్‌సీలో ఉత్తీర్ణత సాధించిన ఖైదీలకు డా. సౌమ్య మిశ్రా ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ప్రతికూల పరిస్థితులను అధిగమించి పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర శ్రమతో విద్యలో విజయం సాధించడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. విద్య ద్వారా జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడంతో పాటు కుటుంబాలకు గౌరవప్రదమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. విద్యపై ఖైదీలు చూపిన నిబద్ధతకు గుర్తింపుగా ఎన్ఐఓఎస్ ద్వారా ఎస్ఎస్‌సీలో ఉత్తీర్ణత సాధించిన 78 మందికి డైరెక్టర్ జనరల్ రెమిషన్‌ను ప్రత్యేక ప్రోత్సాహకంగా ప్రకటించారు. ఇక ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులైన ఖైదీలను ఎన్ఐఓఎస్ ద్వారా సీనియర్ సెకండరీ విద్యను కొనసాగించేలా ప్రోత్సహించనుండగా, మరో 47 మంది ఖైదీలు తాజాగా ఎస్ఎస్‌సీ విద్యలో నమోదు చేసుకున్నారు. సీనియర్ సెకండరీ విద్య పూర్తి చేసిన అనంతరం చర్లపల్లి సెంట్రల్ ప్రిజన్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రం ద్వారా డిగ్రీ విద్యను అభ్యసించే అవకాశం కూడా ఉంది. అదేవిధంగా ఎస్ఎస్‌సీలో ఉత్తీర్ణత సాధించిన 78 మంది ఖైదీలు చర్లపల్లి సెంట్రల్ ప్రిజన్‌లోని ఐటీఐలో వివిధ సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులు అభ్యసించేందుకు అర్హత పొందారు. ఖైదీల విద్యా ప్రయాణానికి సహకరించిన జైలు అధికారులు, ఉపాధ్యాయులు, సంక్షేమ అధికారులు, విద్యా సమన్వయకర్తలు, సిబ్బందిని డీజీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఓఎస్ ప్రతినిధులు పరంప్రీత్ సింగ్, డా. ప్రవీణ్ చౌహాన్, జైళ్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ వై. రాజేష్, డీఐజీలు డా. డి. శ్రీనివాస్, ఎం. సంపత్, సంబంధిత జైళ్ల సూపరింటెండెంట్లు, సీనియర్ జైలు అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

# బకాయిల వసూలే లక్ష్యంగా రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు



హైదరాబాద్ – సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో సివిల్ సప్లయిస్ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించి ధాన్యం మిల్లింగ్‌కు సంబంధించి డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్ల నుంచి ప్రభుత్వ బకాయిలను కచ్చితంగా వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ స్టీఫెన్ రవీంద్ర, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బకాయిల వసూలుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించి క్యాబినెట్ సబ్‌కమిటీలో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు. బకాయిల వసూలే ప్రధాన లక్ష్యంగా చర్యలు ఉండాలని, మిల్లర్ల బ్లాక్‌మెయిల్‌ను ప్రభుత్వం సహించబోదని స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా డిఫాల్ట్ అయి ప్రభుత్వ బకాయిలను చెల్లించని రైస్ మిల్లులను స్వాధీనం చేసుకుని మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న గోదాములను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, అవసరమైతే మిల్లింగ్ బాధ్యతలను కూడా మహిళా సంఘాలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ధాన్యం అధికంగా దిగుబడి అయ్యే ప్రాంతాలను గుర్తించి ఐదు నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు 50 నుంచి 100 ఎకరాల విస్తీర్ణంలో గోదాముల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని సీఎం ఆదేశించారు. గోదాముల నిర్మాణానికి గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలని, ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించి కార్యక్రమాలపై పటిష్ఠమైన పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు.

# హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్‌పై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన ప్రచారం




హైదరాబాద్ – సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ నివారణపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు స్వచ్ఛందంగా పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రెండు నెలల ప్రత్యేక అవగాహన ప్రచారం ప్రారంభమైంది. ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12, 2026 వరకు నిర్వహించనున్న ప్రత్యేక సమాచార, విద్యా, అవగాహన కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హెచ్ఐవీ వ్యాప్తిని అరికట్టడంలో ప్రజల్లో అవగాహన, స్వీయ ప్రమాద అంచనా, స్వచ్ఛంద పరీక్షలు, వ్యాధిని ముందుగానే గుర్తించడం, సకాలంలో వైద్య చికిత్స పొందడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల ఎలాంటి వివక్ష చూపకుండా మానవతా దృక్పథంతో అండగా నిలవాలని సూచించారు. ప్రచారంలో భాగంగా హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ ప్రాంతంలో 50కి పైగా ద్విచక్ర వాహనాలతో బైక్ ర్యాలీ, 25కి పైగా ఆటోలతో ఆటో ర్యాలీ నిర్వహించగా, వైద్య, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన వాక్‌థాన్‌లో 1,600 మందికి పైగా పాల్గొని హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ నివారణ, పరీక్షలు, చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ సందేశాలు, నినాదాలతో కూడిన ప్లకార్డులు, లోగోలు, QR కోడ్‌లతో కూడిన గొడుగులను ప్రదర్శించారు. రాష్ట్రంలో హెచ్ఐవీ నివారణ, పరీక్షలు, చికిత్సకు సంబంధించి అమలు చేస్తున్న కార్యక్రమాలపై తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. విద్యాసాగర్ వివరించారు. 2025–26 జాతీయ స్కోర్ కార్డులో తెలంగాణ ఐదో స్థానాన్ని సాధించిందని, 2023లో 31వ స్థానంలో ఉన్న రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ ముకుంద రెడ్డి మాట్లాడుతూ హెచ్ఐవీపై ఉన్న అపోహలను తొలగించి శాస్త్రీయ అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రముఖ సినీ కళాకారుడు తనికెళ్ల భరణి యువత హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై సరైన సమాచారాన్ని తెలుసుకుని బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. హెచ్ఐవీకి సంబంధించిన ప్రామాణిక సమాచారం, నివారణ, పరీక్షలు, చికిత్స సేవల కోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 1097ను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్. చోంగ్తూ, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డా. రవీంద్ర నాయక్, సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, వైద్యులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల వేట విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మృతి



హైదరాబాద్ — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం నకిరేపేట గ్రామంలో వన్యప్రాణుల వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని చెరువుసింగారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ మృతి చెందడంపై అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అనుమానితులు వన్యప్రాణులను వేటాడుతున్నారన్న సమాచారంతో వారిని పట్టుకునేందుకు మరో ముగ్గురు బీట్ ఆఫీసర్లతో కలిసి వెళ్లిన నవీన్ విధి నిర్వహణలో భాగంగా విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. ఘటనపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్‌తో మంత్రి మాట్లాడి వివరాలు తెలుసుకోగా, నవీన్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు డీఎఫ్ఓ వివరించారు. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణలో అటవీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి కొండా సురేఖ అన్నారు. వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలను అమర్చడం అత్యంత ప్రమాదకరమైన చర్య అని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వ్యక్తుల వల్ల వన్యప్రాణులతో పాటు అటవీ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజల ప్రాణాలకు కూడా తీవ్ర ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనపై అటవీ శాఖ, పోలీసు అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులను గుర్తించి చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మృతిచెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ కుటుంబానికి మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విధి నిర్వహణలో అటవీ సిబ్బంది భద్రతకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అటవీ అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ నిబంధనల ప్రకారం నవీన్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలని పీసీసీఎఫ్ వినయ్ కుమార్‌ను మంత్రి ఆదేశించారు.

# గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించాలి

హైదరాబాద్ — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: గోదావరి జలాలను రాష్ట్ర అవసరాలకు గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి బుధవారం నీటిపారుదల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు నీటిని ఎత్తిపోసి వినియోగించుకోవాలని సీఎం సూచించారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలకు అనుగుణంగానే నీటి నిల్వ, నిర్వహణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ పలు లోపాలు ఉన్నట్లు తేలిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించగా, ఈ అంశంపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీతో సంప్రదించి తగిన చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా తొమ్మిది పంపులతో నీటిని ఎత్తిపోస్తున్నట్లు మంత్రి తెలిపారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ఎత్తిపోతల్లో ఉన్న చిన్నచిన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. పలు ప్రాజెక్టుల కింద ముంపునకు గురయ్యే గ్రామాలు, వ్యవసాయ భూములకు పరిహారం, పునరావాస చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నందున వాటిని వేగవంతం చేయాలని సూచించారు. నీటిపారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులపై నివేదిక రూపొందించాలని, తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తయితే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీటిని నింపే అవకాశం ఉంటుందని సీఎం పేర్కొన్నారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యాన్ని పెంచే అంశంపై సమగ్ర అధ్యయనం చేపట్టాలని, గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు త్వరగా కన్సల్టెంట్‌ను నియమించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు ప్రాజెక్టుల భద్రత, నిర్వాసితులకు పరిహారం, పునరావాస చర్యలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి. శేషాద్రి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణకు 11.56 లక్షల ఇళ్ల కేటాయింపునకు మంత్రి పొంగులేటి వినతి

న్యూఢిల్లీ — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ 2.0 కింద తెలంగాణ రాష్ట్రానికి ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. న్యూఢిల్లీలో బుధవారం కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను మంత్రి పొంగులేటి కలిసి వినతిపత్రం అందజేసి, తెలంగాణలో గ్రామీణ పేదలకు ఇళ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. 'ఆవాస్ ప్లస్-2024' యాప్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించగా 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా గుర్తించబడ్డాయని, సూపర్ చెక్‌తో పాటు అనర్హుల తొలగింపు ప్రక్రియ కూడా ఏడాది క్రితమే పూర్తయిందని మంత్రి వివరించారు. గత 12 ఏళ్లుగా తెలంగాణలో పేదల ఇళ్ల నిర్మాణం నిలిచిపోవడంతో భారీగా డిమాండ్ పేరుకుపోయిందని, అందువల్ల అర్హులైన కుటుంబాలన్నింటికీ ఒకేసారి ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ కింద కేంద్ర, సాధారణ రాష్ట్ర వాటాలతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు అవసరమైన నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో ఇప్పటికే కేటాయించామని పొంగులేటి తెలిపారు. ఇదే సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా మంత్రి పొంగులేటి ఆహ్వానించారు. స్వయంగా తెలంగాణకు వచ్చి ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ 2.0 కింద ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే గ్రామీణ పేదలకు మరింత భరోసా కలుగుతుందని, అది చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ ఆహ్వానంపై కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందించి తెలంగాణ పర్యటనకు అంగీకరించారు. ఈ భేటీలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేష్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రసవం కోసం వస్తే ప్రాణమే పోయింది

సంగారెడ్డి — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం కోసం చేరిన 33 ఏళ్ల గర్భిణీ అనిత మృతి చెందడం తీవ్ర విషాదానికి దారితీసింది. చౌటకూర్ మండలం బద్రిగూడెం గ్రామానికి చెందిన అనిత, భర్త శ్రీశైలంతో కలిసి తొమ్మిది నెలల గర్భిణీగా ఈ నెల 10న సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో చేరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స పొందుతున్న సమయంలో గురువారం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో అనితకు అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి మృతి చెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు ఆసుపత్రికి చేరుకుని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి సరైన వైద్యం అందకపోవడం, వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే అనిత ప్రాణాలు కోల్పోయిందని వారు ఆరోపించారు. బాధ్యులైన వైద్యులు, సిబ్బందిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ఆవరణలో ఆందోళనకు దిగడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న సంగారెడ్డి పోలీసులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని ఆందోళన చేస్తున్న బంధువులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు చికిత్స కోసం వస్తున్న నేపథ్యంలో వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మృతురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు. అయితే అనిత మృతికి అసలు కారణం, వైద్యపరంగా ఏ పరిస్థితుల్లో ఆమెకు చికిత్స అందించారనే అంశాలపై అధికారిక విచారణ అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.




# 200 మీటర్ల జాతీయ జెండాతో నర్సాపూర్‌లో ఘనంగా తిరంగా యాత్ర

నర్సాపూర్ — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జాతీయ జెండా పండుగ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపల్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ దేశభక్తి తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు. బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వల్లాస్ మల్లేష్ గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మీటర్ల పొడవైన భారీ జాతీయ జెండాను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాతో ముందుకు సాగిన ఈ తిరంగా యాత్ర పట్టణంలో దేశభక్తి ఉత్సాహాన్ని నింపింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకుడు రంజిత్ కుమార్ హాజరుకాగా, బీజేపీ నర్సాపూర్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 1,000 మంది విద్యార్థులు, నాయకులు, ప్రజలు జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశ సమైక్యత, జాతీయ స్ఫూర్తి, దేశభక్తి భావాలను ప్రజల్లో మరింతగా పెంపొందించడమే తిరంగా యాత్ర ఉద్దేశ్యమని నాయకులు పేర్కొన్నారు. భారీ జాతీయ జెండాతో నిర్వహించిన ఈ ప్రదర్శన నర్సాపూర్ పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# నడిగూడెం వారాంతపు సంతలో కోదాడ మెగా క్లాత్ కట్‌పీసులకు అవకాశం



నడిగూడెం — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న వారాంతపు సంతను మరింత విస్తరించి ప్రజలకు అవసరమైన అన్ని రకాల వస్తువులు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో చర్యలు చేపడుతున్నట్లు సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి తెలిపారు. ఇందులో భాగంగా వచ్చే మంగళవారం నుంచి కోదాడ మెగా క్లాత్ కట్‌పీసెస్‌ను నడిగూడెం వారాంతపు సంతలో అందుబాటులోకి తీసుకువచ్చేలా సంబంధిత యాజమాన్యంతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఉపయోగపడే విధంగా సరసమైన ధరలకు వస్త్ర కట్‌పీసులను అందించేందుకు యాజమాన్యం సంతలో భాగస్వామ్యం అవుతామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. వారాంతపు సంతలో కొత్త వ్యాపారాలు పెరగడం ద్వారా స్థానిక ప్రజలకు అవసరమైన వస్తువులు ఒకే చోట అందుబాటులోకి రావడంతో పాటు స్థానికంగా వ్యాపార కార్యకలాపాలు కూడా విస్తరిస్తాయని అన్నారు. నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మంగళవారం వారాంతపు సంత మరింత అభివృద్ధి చెందేందుకు సర్పంచ్ శ్రీనివాస్ నాయకత్వంలో పాలకవర్గ సభ్యుల సహకారంతో తమ వంతు కృషి చేస్తామని, గ్రామ అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమానికి సహకరిస్తామని సదా ప్రజాసేవలో ఉంటామని వేపూరి తిరపతమ్మ, సుధీర్ తెలిపారు. వచ్చే మంగళవారం నుంచి కట్‌పీసుల విక్రయాలు ప్రారంభం కానుండటంతో ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.



## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలి: కలెక్టర్

హుజూర్‌నగర్ — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: హుజూర్‌నగర్ రామస్వామిగుట్ట వద్ద నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులను వేగవంతం చేసి, మిగిలిపోయిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం మోడల్ కాలనీని పరిశీలించిన కలెక్టర్ ప్రతి బ్లాక్‌లోని ఇళ్లను ప్రత్యక్షంగా పరిశీలించి, చిన్నచిన్న లోపాలు ఉన్నా వెంటనే గుర్తించి సరిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీ, తాగునీరు, రహదారులు తదితర మౌలిక వసతుల పనులను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా ఇళ్ల పంపిణీ ప్రక్రియను పూర్తి చేస్తామని, లబ్ధిదారుల జాబితాను ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఆర్డీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా ప్రాథమికంగా 1,805 మంది అర్హులైన లబ్ధిదారులతో తాత్కాలిక జాబితా సిద్ధం చేసినట్లు వెల్లడించారు. జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను ప్రత్యేక బృందాల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని, అర్హత లేని వారి పేర్లను తొలగించి నిజమైన పేదలకు మాత్రమే ఇళ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల సముదాయంలో మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనం పునాది పనులు, డైనింగ్ హాల్ నిర్మాణం వేగంగా కొనసాగుతున్నాయని, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, వర్షపు నీటి కాలువల నిర్మాణ పనులకు కూడా ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయాలని సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం లోపించకుండా ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ జబ్బర్ హేహ్మద్, తహసీల్దార్ కవిత, మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## గ్రూప్-2 శిక్షణాధికారులకు వైద్యశాఖ కార్యక్రమాలపై అవగాహన

ఘన్పూర్ హవేలీ — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: గ్రూప్-2 శిక్షణలో భాగంగా శిక్షణ పొందుతున్న తహసీల్దార్లు మెదక్ జిల్లా సర్ధానా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఘన్పూర్ హవేలీని సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది విధులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఎస్. మదన్‌మోహన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న నిరంతర వైద్య సేవలు, ఆశా కార్యకర్తల బాధ్యతలు, ఏఎన్ఎం, హెల్త్ సూపర్‌వైజర్, ఫార్మసీ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్‌ల విధి విధానాలను ట్రైనీ అధికారులకు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాథమిక వైద్య సేవలు, ఆరోగ్య పరిరక్షణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల పాత్రను వివరించారు. శిక్షణలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న గ్రూప్-2 ట్రైనీ అధికారులు వైద్యశాఖ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఆర్. సమదానిక, హెల్త్ సూపర్‌వైజర్ టి.ఏ. సునంద, ఏఎన్ఎం సునీత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఒక్క బస్తా యూరియా కోసం యజమాని కాళ్లపై పడిన వృద్ధ రైతు

రంగంపేట — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో ఒక్క బస్తా యూరియా కోసం ఓ వృద్ధ రైతు ఎరువుల దుకాణం యజమాని కాళ్లపై పడి కన్నీటితో వేడుకున్న హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. పంటకు అవసరమైన యూరియా కోసం దుకాణానికి వచ్చిన వృద్ధ రైతు తనకు కొడుకులు లేరని, ప్రతిరోజూ యూరియా కోసం వచ్చి తిరిగే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ రూ.900 తీసుకున్నా సరే తనకు ఒక్క బస్తా యూరియా ఇవ్వాలని దుకాణ యజమానిని వేడుకున్నాడు. ఈ క్రమంలో తీవ్ర ఆవేదనకు గురైన రైతు దుకాణ యజమాని కాళ్లు పట్టుకుని కన్నీరు పెట్టుకోవడం అక్కడున్న వారిని కలచివేసింది. పంటను కాపాడుకునేందుకు అవసరమైన ఎరువు కోసం ఒక వృద్ధ రైతు ఈ స్థాయిలో ప్రాధేయపడాల్సిన పరిస్థితి రావడంపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన సమయంలో యూరియా అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎరువుల కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.



## దోసపాడు నుంచి సూర్యాపేటకు మంచినీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు

సూర్యాపేట — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: దోసపాడు నుంచి సూర్యాపేట పట్టణానికి మంచినీటి సరఫరాను పునరుద్ధరించి ప్రజలకు మెరుగైన తాగునీటి వసతి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి తెలిపారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని 40వ వార్డులో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న నాలుగు కల్వర్టుల నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో మంచినీటి సరఫరాను మెరుగుపరచడంతో పాటు మిషన్ భగీరథ ద్వారా అందుతున్న నీటి సరఫరాను మరింత పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. పట్టణంలోని అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తామని పేర్కొన్నారు. ఇటీవల నాగార్జునసాగర్‌లో నిర్వహించిన వరుణ యాగం సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి పట్టణ సమస్యలను వివరించినట్లు తెలిపారు. 60 అడుగుల రోడ్డు అండర్‌పాస్ సమస్య పరిష్కారానికి జాతీయ రహదారి అధికారులతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. సూర్యాపేట పట్టణంలోని అన్ని వార్డుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు కొణతం రాజేష్‌రెడ్డి, కొండపల్లి దిలీప్‌రెడ్డి, చిలుముల సునీల్‌రెడ్డి, నాగుల వాసు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, తంగెళ్ల కరుణాకర్‌రెడ్డి, నరేందర్ నాయుడు, ఆలేటి మాణిక్యం, మద్దెబోయిన శ్రీనివాస్, నరేష్ పిళ్లై, వంశీ, వెంకన్న, సంజయ్, వార్డు జవాన్ శ్రవణ్, వార్డు ఆఫీసర్ సత్య తదితరులు పాల్గొన్నారు.

## పుల్కల్‌లో ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర



పుల్కల్, సంగారెడ్డి — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పుల్కల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం భారీ తిరంగా పాదయాత్ర నిర్వహించారు. స్థానిక శివాలయం నుంచి పుల్కల్ మండల కార్యాలయం వరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని ఉత్సాహంగా ర్యాలీగా తరలివెళ్లగా, “భారత్ మాతాకీ జై”, “వందేమాతరం” నినాదాలతో పుల్కల్ మార్మోగింది. ఈ సందర్భంగా బీజేపీ పుల్కల్ మండల అధ్యక్షుడు అమ్ముల నవీన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగాల ఫలితంగానే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలని, ప్రతి పౌరుడిలో జాతీయత, దేశభక్తి భావాలను మరింతగా పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం ర్యాలీ ముగింపులో జాతీయ గీతాలాపన నిర్వహించి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా హర్ ఘర్ తిరంగా మహిళా ఇన్‌చార్జి కొత్తపల్లి జ్యోత్స్న-అశోక్, తిరంగా ర్యాలీ ఇన్‌చార్జి జగన్నాథం, పుల్కల్ మండల అధ్యక్షుడు అమ్ముల నవీన్, మాజీ మండల అధ్యక్షుడు పాండరి, జనరల్ సెక్రటరీ జగన్ గౌడ్, ఓబీసీ మోర్చా సంతోష్ కుమార్, కుమ్మరి యాదయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, శివ విజయ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# అచ్చన్నపల్లి గ్రామానికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

టేక్మాల్, మెదక్ — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు టేక్మాల్ మండలం అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో తులసీరామ్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, టేక్మాల్ సర్పంచ్ సుధాకర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగమేశ్వర్ గౌడ్, అచ్చన్నపల్లి సర్పంచ్ చంద్రపు సాయిలుగౌడ్, గ్రామ పెద్దలు యాదగౌడ్ తదితరులు పాల్గొని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# 32 ఏళ్ల సేవలకు వీడ్కోలు.. హోంగార్డ్ రాజయ్య ఉద్యోగ విరమణ

సూర్యాపేట — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: సూర్యాపేట జిల్లా పోలీస్ భరోసా కేంద్రంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న రాజయ్య బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ రాజయ్య దంపతులను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో సుదీర్ఘంగా 32 సంవత్సరాల పాటు విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించి వారి మన్ననలు పొందిన రాజయ్య సేవలు అభినందనీయమని కొనియాడారు. విధి నిర్వహణలో ఆయన చూపిన అంకితభావం, క్రమశిక్షణ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి శేష జీవితాన్ని ప్రశాంతంగా, ఆరోగ్యంగా, సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్ ఇన్‌చార్జి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నారాయణరాజు, ఆర్ఎస్ఐ అశోక్, రాజయ్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పోలీసు సిబ్బంది పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



# నేరాల దర్యాప్తులో వేగం పెంచాలి: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

మెదక్, మెదక్ జిల్లా — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టడంతో పాటు కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో దర్యాప్తులో ఉన్న పోక్సో, గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ, ప్రతి కేసును నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తిచేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని వేగంగా పరిష్కరించాలని, గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ ఆధారాలను సేకరించి నిందితులకు శిక్షపడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పెంచాలని, నేరాల నియంత్రణలో భాగంగా బ్లూకోల్ట్స్, రాత్రి పెట్రోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలకు జియోట్యాగింగ్ చేయాలని, రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, ఓవర్‌లోడ్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో సానుభూతితో వ్యవహరించి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష్య తదితర దరఖాస్తుల్లో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్రబోస్, సీఐలు మహేష్, రేణుక, వెంకట రాజాగౌడ్, సైదా, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, రంగకృష్ణ, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు కృషి చేస్తాం: సీపీఎం

మెదక్, మెదక్ జిల్లా — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు కృషి చేస్తామని సీపీఎం మెదక్ జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ అన్నారు. సీతారాం ఏచూరి 74వ జయంతి సందర్భంగా బుధవారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కె. నర్సమ్మ మాట్లాడుతూ సీతారాం ఏచూరి జాతీయవాదిగా, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మేధావిగా, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన నాయకుడిగా పేర్కొన్నారు. 1978లో విద్యార్థి సంఘం అఖిల భారత కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, 1998లో సీపీఎం అఖిల భారత కమిటీకి ఎన్నికయ్యారని, అనంతరం పార్టీ 21వ అఖిల భారత మహాసభల్లో అఖిల భారత కార్యదర్శిగా ఎన్నికయ్యారని గుర్తుచేశారు. ఏచూరి మృదుస్వభావి అయినప్పటికీ ప్రజా సమస్యల విషయంలో ధైర్యంగా తన అభిప్రాయాలను వెల్లడించేవారని, అత్యవసర పరిస్థితుల సమయంలో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీని సైతం ప్రశ్నించి మాట్లాడిన ధైర్యశాలి అని అన్నారు. 2005లో పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ఏచూరి పార్లమెంటులో అనేక ప్రజా సమస్యలను ప్రస్తావించి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. అమెరికా విదేశాంగ విధానాన్ని ఏచూరి తీవ్రంగా వ్యతిరేకించారని, అమెరికా సైనిక జోక్యం వల్ల ప్రపంచవ్యాప్తంగా మతోన్మాదం, తీవ్రవాద ధోరణులు పెరుగుతాయని ఆయన అప్పట్లోనే హెచ్చరించారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన వనరులపై ఆధిపత్యం సాధించేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని ఏచూరి పేర్కొన్న విషయాలను ఆమె గుర్తుచేశారు. ఏచూరి చూపిన పోరాట బాటలోనే మెదక్ జిల్లా పార్టీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేస్తామని నర్సమ్మ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె. మల్లేశం, జిల్లా కమిటీ సభ్యుడు జె. సంతోష్, వికలాంగుల సంఘం జిల్లా నాయకులు కవిత, గీత, పార్టీ నాయకుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆస్పత్రి బాత్రూంలో శిశువు మృతదేహం.. పోలీసుల విచారణ

సదాశివపేట, సంగారెడ్డి — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: సంగారెడ్డి జిల్లా సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రిలోని బాత్రూంలో గుర్తుతెలియని శిశువు మృతదేహం లభ్యమైన ఘటన నాలుగు రోజుల కిందట వెలుగులోకి రావడంతో స్థానికంగా కలకలం రేపింది. ఆస్పత్రి మరుగుదొడ్డిలో శిశువు మృతదేహాన్ని డ్యూటీ వైద్యుడు గుర్తించి వెంటనే సదాశివపేట పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి విచారణ ప్రారంభించారు. శిశువు మృతదేహం ఆస్పత్రి బాత్రూంలోకి ఎలా వచ్చింది, ఎవరు అక్కడ వదిలి వెళ్లారు అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఆస్పత్రికి వచ్చిన వారి వివరాలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, ఇతర పరిస్థితులను పరిశీలిస్తూ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెలికితీసేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. శిశువు మృతికి గల కారణాలు, మృతదేహాన్ని అక్కడ వదిలి వెళ్లిన వ్యక్తుల వివరాలు దర్యాప్తు పూర్తయిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.



# 12 రోజుల వ్యవధిలోనే దత్తాత్రేయ ఆలయంలో రెండోసారి హుండీ చోరీ

గూడూరు, మెదక్ — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట మండలం గూడూరు గ్రామంలోని దత్తాత్రేయ ఆలయంలో దొంగలు మరోసారి చోరీకి పాల్పడటం కలకలం రేపింది. గత చోరీ ఘటన జరిగి 12 రోజులు కూడా పూర్తికాకముందే అదే ఆలయంలో మరోసారి హుండీని పగలగొట్టి అందులోని నగదును అపహరించినట్లు తెలుస్తోంది. ఆలయంలోకి ప్రవేశించిన దుండగులు హుండీని ధ్వంసం చేసి నగదును తీసుకెళ్లినట్లు సమాచారం. ఒకే ఆలయంలో తక్కువ వ్యవధిలో రెండుసార్లు చోరీ జరగడంతో గ్రామస్థులు, భక్తుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఆలయ భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరించి, చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. వరుస చోరీల నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో నిఘా పెంచి, రాత్రివేళల్లో గస్తీ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

# హైదరాబాద్ యూనివర్సిటీలో ఘనంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవ వేడుకలు






హైదరాబాద్ — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని ఇందిరా గాంధీ మెమోరియల్ లైబ్రరీ ఆధ్వర్యంలో 134వ జాతీయ గ్రంథపాలకుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అతిథుల జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్‌చాన్స్‌లర్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ జ్యోస్నలగడ్డ అనురాధ ముఖ్య అతిథిగా, ఫైనాన్స్ ఆఫీసర్ డా. బి. శ్రీనివాస్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. యూనివర్సిటీ లైబ్రేరియన్ ఇన్‌చార్జి డా. ఓ. శివశంకర్ ప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జ్యోస్నలగడ్డ అనురాధ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో గ్రంథాలయాల పాత్రలో వస్తున్న మార్పులను వివరించి, బోధన, అభ్యసన, పరిశోధన రంగాల్లో గ్రంథపాలకులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఫైనాన్స్ ఆఫీసర్ డా. బి. శ్రీనివాస్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంలో వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా గ్రంథాలయాలు తమ సేవలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని, అదే సమయంలో జ్ఞానం, మేధోపరమైన చర్చలు, విద్యా ప్రగతికి కేంద్రాలుగా తమ ప్రాథమిక పాత్రను కొనసాగించాలని సూచించారు. డా. ఓ. శివశంకర్ ప్రసాద్ భారతదేశంలో గ్రంథాలయ శాస్త్ర పితామహుడిగా ప్రసిద్ధి చెందిన డా. ఎస్.ఆర్. రంగనాథన్ విశిష్ట సేవలను స్మరించుకుని, విద్య, పరిశోధన, విజ్ఞాన వ్యాప్తిలో గ్రంథపాలకులు పోషిస్తున్న కీలక పాత్రను వివరించారు. కార్యక్రమంలో భాగంగా 72వ ఇండియన్ లైబ్రరీ అసోసియేషన్ అంతర్జాతీయ సదస్సు 'ఫ్లేర్–2027'కు కర్టెన్ రైజర్ నిర్వహించి, సదస్సు అధికారిక వెబ్‌సైట్, బ్రోచర్లు, పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రంథాలయ మరియు సమాచార శాస్త్ర రంగానికి చెందిన గ్రంథపాలకులు, సమాచార నిపుణులు, అధ్యాపకులు, పరిశోధకులు, ఇతర భాగస్వాములు ఒకే వేదికపై సమావేశమై ఆలోచనలు, నూతన ఆవిష్కరణలు, అనుభవాలను పంచుకునేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. విశ్వవిద్యాలయ గ్రంథాలయ వనరులను అత్యుత్తమంగా వినియోగించిన విద్యార్థులకు బెస్ట్ లైబ్రరీ యూజర్స్ అవార్డులను అందజేసి, విద్యార్థుల్లో పఠన, అభ్యసన, పరిశోధనా సంస్కృతిని ప్రోత్సహించారు. అనంతరం గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఇందిరా గాంధీ మెమోరియల్ లైబ్రరీ నాణ్యమైన సమాచార వనరులు, ఆధునిక గ్రంథాలయ సేవలను అందించడంతో పాటు పఠనం, పరిశోధన, జీవితాంతం అభ్యసనకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పరిశోధకులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లి, మూడేళ్ల కుమారుడు అదృశ్యం






మెదక్ నియోజకవర్గం — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: యెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో 25 ఏళ్ల మహిళ తన మూడేళ్ల కుమారుడితో కలిసి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. శంకరంపేట–రామాయంపేట మండలం ధర్పల్లి గ్రామానికి చెందిన చాకలి అనూష (25)కు మెదక్ రూరల్ మండలానికి చెందిన చాకలి అనిల్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉండగా, కుటుంబ కలహాల కారణంగా గత ఏడాది నుంచి అనూష తన మూడేళ్ల చిన్న కుమారుడితో కలిసి ధర్పల్లిలోని తల్లి ఇంట్లో ఉంటోంది. బోనాల పండుగ సందర్భంగా ఆగస్టు 8న ఉప్పులింగాపూర్‌లోని తన పిన్ని చాకలి యాదమ్మ ఇంటికి వెళ్లిన అనూష, ఆగస్టు 10న సాయంత్రం 5 గంటల సమయంలో మూడేళ్ల కుమారుడిని తీసుకుని ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు వెతకగా, ఆమె యెల్దుర్తి బస్టాండ్ వద్ద మెదక్ వైపు వెళ్లే బస్సు ఎక్కినట్లు స్థానికులు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అనూష తల్లి చాకలి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన అనూష ఆకాశ నీలం రంగు టాప్, నల్లరంగు ప్యాంట్ ధరించి ఉండగా, ఆమె కుమారుడు నీలం రంగు టీషర్ట్, నల్లరంగు షార్ట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనూష, ఆమె కుమారుడి ఆచూకీకి సంబంధించి ఎవరికైనా సమాచారం ఉంటే వెంటనే యెల్దుర్తి పోలీసులకు తెలియజేయాలని కోరారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు.. రూ.2,000 జరిమానా




మెదక్ నియోజకవర్గం — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: భార్యతో చనువుగా ఉంటున్నాడనే అనుమానంతో సహచర కూలీ ప్రమోద్ పాశ్వాన్ (43)ను కర్రతో కొట్టి హత్య చేసిన కేసులో నిందితుడు బిట్టు కుమార్ (22)కు జీవిత ఖైదుతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి నీలిమ తీర్పు వెలువరించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. కేసు వివరాల ప్రకారం బిట్టు కుమార్ తన భార్య పూజా కుమారి, పిల్లలతో కలిసి కళకల్ గ్రామంలో నిర్మాణ పనులు జరుగుతున్న ఇంటి వద్ద కూలీగా పనిచేస్తూ అక్కడే నివసిస్తున్నాడు. అదే ఇంటిలో మేస్త్రీగా పనిచేస్తున్న ప్రమోద్ పాశ్వాన్ కూడా నివాసం ఉంటున్నాడు. ప్రమోద్ పాశ్వాన్ తన భార్యతో చనువుగా ఉండటాన్ని గమనించిన బిట్టు కుమార్ గతంలో పలుమార్లు హెచ్చరించాడు. 2024 నవంబర్ 16న రాత్రి ఇంటికి తిరిగి వచ్చిన బిట్టు కుమార్, ప్రమోద్ పాశ్వాన్ తన భార్య నడుముపై చేయి వేసి ఉండటాన్ని చూసి ఆగ్రహానికి గురై అతడితో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో ప్రమోద్ పాశ్వాన్ బిట్టు కుమార్‌ను తోసివేయడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన బిట్టు కుమార్ మంచంపై ఉన్న కర్రతో అతడిపై దాడి చేయడంతో ప్రమోద్ పాశ్వాన్ మృతి చెందాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. ఘటనపై మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, అప్పటి కేసు దర్యాప్తు అధికారి సీఐ రంగకృష్ణ పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ వాదనలు వినిపించారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు బిట్టు కుమార్‌ను దోషిగా నిర్ధారించి జీవిత ఖైదుతో పాటు రూ.2,000 జరిమానా విధించారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ మహిపాల్ రెడ్డి సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసి, పూర్తి సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అభినందించారు.



## పటాన్‌చెరులో ఘనంగా అమ్మవారి పలారం బండి ఊరేగింపులు

పటాన్‌చెరు — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: బోనాల ఉత్సవాల్లో భాగంగా పటాన్‌చెరు డివిజన్‌లోని జేపీ కాలనీ, సాయిరాం నగర్, గోకుల్ నగర్, చైతన్య నగర్, గోనెమ్మ బస్తీ, శాంతినగర్, పాత మార్కెట్ యార్డు, గౌతమ్ నగర్ తదితర కాలనీలలో వివిధ యువజన సంఘాలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి పలారం బండి, తొట్టెల ఊరేగింపు కార్యక్రమాల్లో పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విశిష్ట పండుగ బోనాల ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని, అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి జరుపుకునే గొప్ప పండుగగా బోనాలకు ప్రత్యేకత ఉందన్నారు. ప్రతి ఏడాది పటాన్‌చెరులో బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, తాను కార్పొరేటర్‌గా ఎన్నికైన నాటి నుంచి డివిజన్ పరిధిలో జరిగే ప్రతి పండుగకు అవసరమైన ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.




## మధిరలో మినీ టీ-వర్క్స్ కేంద్రం ఏర్పాటుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలి

ఖమ్మం — సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ శెట్టి సురేష్, ఆగస్టు 13: మధిరలో మినీ టీ-వర్క్స్ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన అన్ని అంశాలను పరిశీలించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో తయారీ, సృజనాత్మకత, ఆవిష్కరణలపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రాక్టికల్ శిక్షణ, ఫీల్డ్ విజిట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మధిరలో గుర్తించిన స్థలానికి సమీపంలోని 20 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి 8, 9వ తరగతి విద్యార్థులకు టీ-వర్క్స్ ఆధ్వర్యంలో శిక్షణ అందించాలని, ఐటీఐ, డిప్లొమా, ఇంజినీరింగ్ విద్యార్థులు స్వయంగా ప్రాజెక్టులు రూపొందించేలా ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థులకు ఆలోచన నుంచి ప్రాజెక్టు రూపకల్పన, తయారీ, పరీక్ష వరకు పూర్తి స్థాయిలో శిక్షణ అందించాలని, అవసరమైన పరికరాలు, యంత్రాలను పాఠశాలలకు తీసుకెళ్లి వాటి వినియోగాన్ని ప్రత్యక్షంగా వివరించాలని ఆదేశించారు. మినీ టీ-వర్క్స్ కేంద్రానికి సుమారు 1,500 నుంచి 2,000 చదరపు అడుగుల స్థలం అవసరమని టీ-వర్క్స్ సీఈఓ తనికెళ్ల జోగిందర్ తెలిపారు. కేంద్రం ఏర్పాటుకు సీఎస్ఆర్ సంస్థలు, పరిశ్రమల సహకారం తీసుకోవాలని, కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, టీ-వర్క్స్ సీఈఓ తనికెళ్ల జోగిందర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎర్రుపాలెం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న లింగాల కమల్ రాజు

ఎర్రుపాలెం — సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్, ఆగస్టు 13: మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలంలో ఖమ్మం జిల్లా మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్ రాజు బుధవారం పలు గ్రామాల్లో పర్యటించి అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించడంతో పాటు ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలిపారు. ముందుగా గుంటుపల్లి గోపవరం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మందడపు వెంకటేశ్వరరావును కలిసి పలకరించిన అనంతరం భీమవరం గ్రామంలో గుండె శస్త్రచికిత్స చేయించుకున్న శీలం నాగిరెడ్డి, చేతికి శస్త్రచికిత్స చేయించుకున్న కొండపల్లి రాఘవరావులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజులదేవరపాడు గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలను పరామర్శించారు. బనిగండ్లపాడు మాజీ సర్పంచ్ జంగ పుల్లారెడ్డికి కాలికి శస్త్రచికిత్స జరగడంతో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అలాగే ఎర్రుపాలెం సాక్షి విలేకరి గంధం శ్రీనివాసరావు తల్లి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సేగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గూడూరు రమణారెడ్డి, మాజీ సర్పంచ్ కోట శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, గోపవరం గ్రామ శాఖ అధ్యక్షుడు మందడపు నరేష్, సర్పంచ్ బెంజిమెన్, బనిగండ్లపాడు నాయకులు లక్కిరెడ్డి అప్పిరెడ్డి, వేమిరెడ్డి పూర్ణ, బండారు వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ డైరెక్టర్ శీలం కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ బహదూర్, భీమవరం గ్రామ శాఖ నాయకులు మందడపు వెంకటేశ్వరరావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ఐనోల్ వార్డులో ఘనంగా పాలారం బండి ఊరేగింపు

పటాన్‌చెరు — సందేశం టైమ్స్ బి. డేవిడ్, ఆగస్టు 13: ఇంద్రేశం మున్సిపాలిటీ ఐనోల్ వార్డులో నిర్వహించిన పాలారం బండి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో టీమ్ ఎంహెచ్ఆర్ యువసేన సభ్యులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు. ముఖ్య అతిథులుగా యువ నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, శివారెడ్డి పాల్గొని ఊరేగింపులో పాల్గొంటూ యువతను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ యువసేన సభ్యుల సమన్వయం, క్రమశిక్షణ, ఉత్సాహంతో కార్యక్రమం వైభవంగా సాగిందని, ప్రజల సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుతూ ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో టీమ్ ఎంహెచ్ఆర్ యువసేన ముందుండడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువసేన సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆషాఢ అమావాస్య సందర్భంగా ముత్యాలమ్మ ఆలయంలో విశేష పూజలు

జోగిపేట — సందేశం టైమ్స్ అందోల్ మండల ప్రతినిధి వి. వెంకటేశం, ఆగస్టు 13: ఆషాఢ అమావాస్య సందర్భంగా జోగిపేట పట్టణంలోని ముత్యాలమ్మ (వజనాలమ్మ) అమ్మవారి ఆలయంలో విశేష పూజలు, ఆలయ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించగా, పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో మహిళలు, భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఎం. మల్లికార్జున్ గుప్త, బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, బిర్ల శంకర్, యెర్ర సాయిలు, పుర ప్రముఖులు జూకంటి లక్ష్మణ్, రెడ్డిపల్లి బ్రహ్మాయ్య, శ్రీనివాస్ రెడ్డి, బంజ రవి, జలగరి యాదగిరి తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కటుకం ప్రవీణ్ కుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.






## శ్రావణమాసంలో బసవ మంటపంలో ప్రవచన కార్యక్రమాలు ప్రారంభం

జహీరాబాద్ — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ దత్తగిరి కాలనీలోని బసవ మంటపంలో రాష్ట్రీయ బసవదళ్, అక్కనాగలాంబిక మహిళా గణ ఆధ్వర్యంలో శ్రావణమాస ప్రవచన కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలు ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 11 వరకు 31 రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు నిర్వహించనున్నారు. విశ్వగురు బసవేశ్వరుని సాముహిక ప్రార్థన, ధ్వజారోహణ అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి, గురుమాత నందాతాయి ధార్వాడ్ ఆధ్వర్యంలో మహా మానవతావాది జగజ్యోతి మహాత్మా బసవేశ్వరుని వచన సందేశాలపై ప్రవచనాలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షుడు కుష్నూర్ శంకర్ పాటిల్ తెలిపారు. ప్రతిరోజూ బసవదళ్ కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. తొలి రోజు న్యామతాబాద్ గ్రామానికి చెందిన బిరాదర్ అన్నపూర్ణ పాటిల్, అప్పారావు పాటిల్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో రాష్ట్ర రాష్ట్రీయ బసవదళ్ ఉపాధ్యక్షుడు యశ్వంత్ రావు పాటిల్, జహీరాబాద్ టౌన్ అధ్యక్షుడు డా. శరణప్ప బలోడే, ఉపాధ్యక్షుడు సత్వార్ అన్వీర్, సురేష్ పాటిల్, మైకోడ్ నాగేష్, సంగమేశ్వర్ పాటిల్, అక్కనాగలాంబిక మహిళా గణ భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## వీధి కుక్కల సంచారంతో భయాందోళనలో బాటసారులు, వాహనదారులు

పటాన్‌చెరు — సందేశం టైమ్స్ బి. డేవిడ్, ఆగస్టు 13: ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని సాయి కాలనీ, ఆర్‌కే నగర్ ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో బాటసారులు, వాహనదారులు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుక్కలు గుంపులుగా రోడ్లపై సంచరిస్తూ బైక్‌లు, సైకిళ్లపై వెళ్లేవారిని వెంబడిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. చిన్నారులను బయటకు పంపేందుకు, వృద్ధులు ఉదయం నడకకు వెళ్లేందుకు కూడా భయపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించిన స్థానికులు, వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు, యాంటీ రేబిస్ టీకాలు అందించి ప్రజలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



## ఆగస్టు 15న సీఎం పర్యటనను అడ్డుకుంటాం: ఏబీవీపీ

సంగారెడ్డి — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ రాజు మాట్లాడుతూ తెలంగాణలో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సుమారు రూ.11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక, సెమిస్టర్ పరీక్షలకు హాల్‌టికెట్లు పొందడంలో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా ప్రతి సంవత్సరం సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఆరోపించారు. గత మూడేళ్లలో ఫుడ్ పాయిజనింగ్, పాముకాటు, తేలు కాటు కారణంగా 118 మంది చిన్నారులు మృతి చెందారని, ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని కోరుతూ, తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఆగస్టు 15న సీఎం పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆందోళన సందర్భంగా పోలీసులు పలువురు ఏబీవీపీ కార్యకర్తలను అరెస్టు చేయడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ధనరాజ్, జిల్లా హాస్టల్స్ కన్వీనర్ సాయికృష్ణ, మనోహర్, సతీష్, లోకేష్, జగన్, కళ్యాణి, కీర్తన, నవనీత, పూజ, సంజన, శివమణి తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగ, ఆధ్యాత్మిక, సామాజిక విలువలపై అవగాహన అవసరం: మాద్రి పృథ్వీరాజ్

పటాన్‌చెరు — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: పటాన్‌చెరు పట్టణం శాంతినగర్‌లోని మెథోడిస్ట్ చర్చ్‌లో పటాన్‌చెరు నియోజకవర్గ క్రిస్టియన్ లీగల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక, సామాజిక అవగాహన సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాజ్యాంగ అవగాహన సదస్సులో పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని అన్నారు. ముఖ్యంగా యువత రాజ్యాంగ విలువలు, మానవ హక్కులు, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఆధ్యాత్మికతతో పాటు రాజ్యాంగ స్ఫూర్తి, చట్టపరమైన అవగాహన, సామాజిక బాధ్యతలపై ప్రజల్లో చైతన్యం పెంపొందించే కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, నైతిక విలువలు, బాధ్యతాయుత పౌరసత్వాన్ని బలోపేతం చేయడానికి ఎంతో అవసరమని పృథ్వీరాజ్ పేర్కొన్నారు.



## స్నేహితుల సమక్షంలో ఘనంగా సుకూరి కార్తీక్ జన్మదిన వేడుకలు

వట్పల్లి — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మరవెల్లి గ్రామానికి చెందిన సుకూరి కార్తీక్ జన్మదిన వేడుకలను స్నేహితుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహితులు కార్తీక్‌తో కలిసి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్తీక్ ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవిస్తూ జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్నేహితులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో అభి, సురేష్, మహేష్, సాగర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొని కార్తీక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. స్నేహితుల మధ్య జరిగిన జన్మదిన వేడుకలు ఆనందోత్సాహాల నడుమ స్నేహపూర్వక వాతావరణంలో ఘనంగా జరిగాయి.




## పాల్వట్ల సర్పంచ్ మైపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

వట్పల్లి — సందేశం టైమ్స్ ప్రతినిధి సిహెచ్. బస్వరాజు, ఆగస్టు 13: వట్పల్లి మండల పరిధిలోని పాల్వట్ల గ్రామ సర్పంచ్ మైపాల్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీ కేతకి సంగమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆత్మ కమిటీ డైరెక్టర్ పెద్దగోళ్ల సాయిబాబా సర్పంచ్ మైపాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని, పాల్వట్ల గ్రామాన్ని మరింత అభివృద్ధి బాటలో నడిపించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజు, సందీప్, విశ్వనాథ్ రెడ్డి, అబ్బీ తదితరులు పాల్గొన్నారు.




## బోనాలు, పలారం బండి ఊరేగింపుల్లో పాల్గొన్న మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 13: పటాన్‌చెరులోని వెంకటేశ్వర కాలనీలో నిర్వహించిన బోనాల ఊరేగింపు కార్యక్రమంతో పాటు నాయికోటి బస్తి కాలనీలో నిర్వహించిన పలారం బండి ఊరేగింపు కార్యక్రమాల్లో పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటే బోనాల పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, వెలుగులు నింపాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## మోతె మండలంలో వ్యవసాయ భూమిలో భార్యాభర్తల మృతదేహాలు



మోతె — సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి, ఆగస్టు 13: మోతె మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారి వెంట వ్యవసాయ భూమిలో అనుమానాస్పద స్థితిలో పాక్షికంగా పాతిపెట్టిన మగ, ఆడ మృతదేహాలను పోలీసులు గుర్తించి వెలికితీశారు. సమాచారం అందుకున్న వెంటనే సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికుల సమాచారం మేరకు డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ రామకృష్ణారెడ్డి, స్థానిక ఎస్ఐ, క్లూస్‌టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. మృతులను బీక్యాతండాకు చెందిన బూబా, నాగుగా గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. ఎవరైనా వారిని హత్య చేసి మృతదేహాలను తీసుకొచ్చి ఇక్కడ పాతిపెట్టి ఉంటారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, మోతె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.